

# జ్ఞాపకాల జావళి

– పొత్తూరి విజయలక్ష్మి



నా చిన్న తనం మా తాత గారిది కుగ్రామం .రెండు బ్రాహ్మణ వీధులు ..వూరి మధ్యన ఒకే ఆవరణలో విష్ణాలయం, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయం. హైస్కూలు, ఎలిమెంటరీ స్కూలు, పోష్టాఫీసు అనబడే ఆత్మా రాముడు గారి వరండా. మరికాస్త లోపలికి వెళ్తే లైబ్రరీ మరియూ రామభజన మండపం. గుళ్ళకి ఎదురుగా గ్రామదేవత పుట్టలమ్మ ఆలయం. ఇంకాస్త అటుగా వెళ్తే మంచినీళ్ళ బావి అదీ దాటాక మల్లె తోటలూ ,జీడి మావిడి తోటలు, నారు మళ్ళూ , వరి పొలాలు, తాటి తోపులు, బిడారు దిబ్బలు అని పేరుపడ్డ పెద్ద ఇసుక దిబ్బలు. అవి దాటాక ఈ కుగ్రామాన్ని బాహ్య ప్రపంచంతో కలిపే తారు రోడ్డు ఇదీ ఆ గ్రామ స్వరూపం. వూరిపేరు యాజలి.

అందరూ కలిసి కట్టుగా వుండేవాళ్ళు. కులాల అంతరాలు అంతస్తుల తేడాలు ఉండేవికాదు. వూళ్ళో సుబ్బారావు కిరాణాకొట్టు , స్వామాజ్యమ్మ కాఫీ హోటలు ఉండేవి . హోమియో డాక్టరు శేషగిరి రావు గారు ఇంగ్లీషు మందులిచ్చే కంపౌండర్‌గారు వుండేవారు. మేళం వాయించడానికి సుబ్బారాయుడు ఉండేవాడు. రెండు టైరు బళ్ళు, ఒక పల్లకి ఉండేవి. మంచినీళ్ళు పోసే భ్రమరాంబగారు వుండేది .రేడియో అక్కయ్య లాగా వూరందరికీ అక్కయ్యే ఆవిడ. ఆవిడకి ఓ చెల్లెలు సీతారావమ్మ. ఆవిడ భర్త సీతారామయ్య. వాళ్ళిద్దరూ వూరికి కొండంత అండ. ఏపని చెప్పినా కాదనకుండా చేసేవాళ్ళు నిజానికి పాపం వాళ్ళకి ఏ పన్లూరావు . ఊరిమీద ఆధారపడి బతుకుతున్నారు కాబట్టి కాదనకుండా వాళ్ళకి చాతయినట్లు చేసి పడేసేవాళ్ళు. ఆ తరవాత వారిదయ ఎదటివారి ప్రాప్తం. మంత్రాలు వేసి తాయెత్తులు కట్టే దిబ్బమీది బసవడు. మంత్రసాని మంగ వుండేవాళ్ళు . చాటింపు వేసే లక్ష్మడు. వీధి దీపాలు వెలిగించే దరియా వుండేవాళ్ళు. పౌరోహిత్యం చేయించే శాస్తుర్లుగారు, రంగయ్యగారూ వుండేవారు. ఇవీ స్థూలంగా ఆ వూరి మనుషుల వివరాలు. తెల్లవారుజామునే వూరు నిద్ర లేచేది . ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూ పోయేవాళ్ళు. ఎక్కడ , ఎప్పుడు ఎవరు ఎదురైనా ఎన్నో ఏళ్ళ తరువాత కలుసుకున్నవాళ్ళలాగా కరువు తీరా కబుర్లు చెప్పుకునే వాళ్ళు. దాపరికాలు ఉండేవి కాదు. కష్టసుఖాలు ఒకరికొకరు పంచుకునేవాళ్ళు.

ఆ వూరికి కరణం మా తాతగారు. ఉప కరణం ఆయన తమ్ముడు. అనగా మాచిన్న తాతగారు. వూరి పెత్తనం అంతా వారిదే వారి మాట వేదవాక్కు..శిలాశాసనం వారు ఓ పని చెపితే అదీ సుగ్రీవాజ్ఞ. మా అమ్మమ్మ, చిన్న అమ్మమ్మ అధికారం లేక పోయినా బోలెడంత ప్రాముఖ్యం వున్న వాళ్ళు. పగలంతా పనులూ కాలక్షేపం. సాయంత్రం గూట్లో దీపం నోట్లో ముద్ద..అన్నట్లు పెందలాడే భోజనాలు ముగించేసి కాసేపు కబుర్లు. మాధవ కబళం వాళ్ళు వచ్చి మిగులు తగులు పట్టుకుపోవటంతో ఆవేళ్టి పనులు ముగిసినట్టే

ఇక అందరూ పక్కలు ఎక్కేవాళ్ళు. గడియారం ప్రకారం అప్పటికీ ఎనిమిది కూడా అయ్యేది కాదు. కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోయేవాళ్ళు.

ఇళ్ళల్లో సామాన్లు కూడా మితంగానే ఉండేవి నవారు మంచాలు, చాపలు పరుపులు పక్క బట్టలు పాత సామాన్లు రెండు ట్రంకు పెట్టెలు ప్రతి వారి ఇంట్లోను ఉండేవి . మరికొన్ని సామాన్లు కలిగిన వారి ఇళ్ళల్లో మాత్రమే ఉండేవి. పందిరి మంచం, గోడ గడియారం, పడక్కుర్చీ గోడకి తగిలించే నిలువుటద్దం పెట్రోమాక్స్ లైటు గ్రాంఫోను ఇవన్ని గొప్ప స్టేటస్ సింబల్స్. ఎవరింటికైనా వియ్యాలవారో అల్లుడో వస్తే ఈ వస్తువులు అరువు అడిగి పట్టుకెళ్ళటం ఆనవాయితీ. సీదా సాదాగా ఐకమత్యంగా ఆనందంగా అమాయకంగా జీవనం సాగించే ఆ వూళ్ళో అనేకానేక మైన అనుభవాలు సంఘటనలు అవన్నీ ముందు ముందు ముచ్చటించుకుందాం. కనుమరుగు అయిపోయిన ఆ రోజులను మళ్ళీ గుర్తుచేసుకుందాం. ఆ మధురానుభూతులను మనసారా ఆస్వాదిద్దాం.

# అసలు రహస్యం

**ఆవేళ శుక్రవారం**. పొద్దుటే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, దైవ ధ్యానం ముగించి, కోడలు ఇచ్చిన పాలు తాగి ఇంటివెనక అరుగు మీద కూర్చుంది బాలమ్మ మామ్మ. మెళ్ళోని పగడాల తావళంతో జపం చేసుకుంటున్నా ఆవిడ ద్రుష్టి అంత దూరాన గట్టుమీద పడుతున్న ఎండ మీదే వుంది.

ఎండ గట్టుదిగితే పది గంటలు అయినట్టు. ఎండ గట్టు దిగింది. పగడాల దండ మెళ్ళో వేసుకుని

" అమ్మాయ్ కామేశ్వరి " అని కేకేసింది.

కామేశ్వరి ఆ ఇంటి ఆఖరి కోడలు.."పిలిచారా ?" అంటూ వచ్చింది .

"గాజుల బత్తుడు ఒచ్చాడా ?" అని అడిగింది ఆత్రంగా.

"ఇంకా రాలేదు. వచ్చేవేళ అయ్యింది" అని చెప్పి వెళ్ళి పోయింది.

అదిమొదలు.. అయిదయిదు నిముషాలకీ ఎవర్నో ఒకరిని పిల్చి " వచ్చాడా గాజుల బత్తుడూ? " అని అడుగుతూనే వుంది.

"అబ్బబ్బ చచ్చిపోతున్నాం ఈవిడతో అయినా ఇదేం ఆరాటం? పోనీ ఆవిడేమైనా గాజులు వేయించుకుంటుందా అంటే ఎప్పుడో చిన్నతనంలోనే ఆ వైభోగం పోయి పైను పంచల గతి పట్టింది. మరి అదేవిటో ఎవరొచ్చారో ఎవరు పోయారో పట్టించుకోదుగానీ గాజుల బత్తుడికోసం ఆత్రంగా ఎదురు చూస్తుంది. మడి ఆచారం అంటూ ఎవరికీ వడ్డన చెయ్యదు గానీ గాజుల బత్తుడికి మాత్రం స్వయంగా వడ్డిస్తుంది"

మొత్తానికి పదకొండు అయ్యాక వచ్చాడు గాజుల బత్తుడు. మలారం దింపుకున్నాడు.

ఆ వెంటనే బిల బిల్లాడుతూ ఆడవాళ్ళు ఓ పదిమంది వచ్చేశారు. కాసిని మంచినీళ్ళు తాగి భుజాన వున్న కండువా నేలమీదపరిచి మూట లోంచీ పొడుగాటి గాజుల పొత్తులు తీసి వరసగా పరిచాడు.

అక్కడ చేరిన వారి కళ్ళు మెరిసాయి. య్రెర గాజులు, పచ్చ గాజులు, నీలం ఆకుపచ్చ పువ్వుల గాజులు, సాదా గాజులు, చిన్న పిల్లలకు రబ్బరు గాజులు, చంటి పిల్లలకు నల్లని గాజులు..

వరసగా వచ్చి గాజులు ఎంచుకుంటున్నారు. ఒక్కో చేతికీ డజను చొప్పున గాజులు తొడుగుతున్నాడు బత్తుడు. డబ్బులిస్తున్నారు కొందరు, 'వడ్లు ఇస్తాను.. ఇంటికొచ్చి పట్టుకెళ్ళు' అంటున్నారు కొందరు. 'ఆయన లేరు.. ఈ సారి వచ్చినప్పుడు ఇస్తా' అంటోంది ఓ ఇల్లాలు.

అందరికీ చిరునవ్వుతోనే సమాధానం చెప్తున్నాడు.

ఇప్పుడా? పాతికేళ్ళుగా వస్తున్నాడు మావూరికి. పదిహేనురోజులకి ఒకసారి వస్తాడు. దమ్మన్న వారిపాలెం, బుద్దాం కర్లపాలెం, రాంభట్ల పాలెం, కావూరు ఖాజీ పాలెం ఒకటేమిటి చుట్టుపక్కల ఊళ్ళు అన్నీ అతనివే. గాజుల మలారం భుజాన వేసుకుని ఊరూరా తిరుగుతాడు.

ఇక్కడ బేరం ముగించుకుని మూట సర్దుకుని మరో వీధికి వెళ్తాడు. మావూళ్ళోనే మూడుచోట్ల మలారం దించి అందరికీ గాజులు తొడిగి మళ్ళీ మాఇంటికి వచ్చి అన్నంతిని బయట అరుగుమీద కాసేపు నడుము వాల్చి లేచి వెళ్ళిపోతాడు.

అతనొచ్చేదాకా భోజనం చెయ్యకుండా కూచుంటుంది మామ్మ. 'మేము పెడతాం.. పెద్దదానివి నీకు కళ్ళు తిరుగుతాయి' అన్నా వినదు.

బత్తుడు వచ్చాడు. "కాళ్ళు కడుక్కో వడ్డిస్తా .. " అని ఇంటికి వెనక అంతదూరాన వున్న సావిట్లో బాదం ఆకుల విస్తరి వేసి వడ్డించి కాస్తాదూరంలో పీట వాల్చుకుని కూర్చుంది.

మరో గొడవ కూడా వుంది.. అతనికి తను అన్నం పెడుతున్నంతసేపు ఎవరూ అటు రాకూడదు. వస్తే తిట్టిపోస్తుంది మామ్మ.

ఆతను అన్నం తిన్నాక బావిదగ్గరికి వెళ్ళి, నాలుగు చాదలు నీళ్ళు తోడి పోసుకుని, ఎంగిలిపడేసరికి ఆవిడకి సోష వచ్చినంత పని అవుతుంది.

"ఎందుకమ్మా ఈ వయసులో నీకింత హైరానా? " అంటే వినదు. విసిగిపోయిన ఆ ఇంటివాళ్ళు అన్నం పెడుతూ ఆవిడ ఏం మాట్లాడుతోందో వినమని నాకు పని అప్పగించారు. అటువంటి గూఢచారి పనులకు నేను పెట్టింది పేరు. నాకు తాయిలాలు పెట్టి అత్తాకోడళ్ళు, తోడికోడళ్ళు ఇటువంటి పనులు చేయించుకోడం అలవాటే.

శుక్రవారం నాడు సావిట్లో నక్కి దాక్కున్నా.

ఆకువేసి అన్నం పెట్టింది బామ్మ. " నాయనా మా అన్నయ్య బావున్నాడ్రుటా?" ఆత్రంగా అడిగింది.

"బావున్నారమ్మ! మా బాలమ్మ ఆరోగ్యంగావుందా ?అని అడిగారు" అన్నాడతను .

కళ్ళొత్తుకుంది బామ్మ " కాస్త లేచి తిరుగుతున్నాడా ? తనపని తను చేసుకుంటున్నాడా? ఎవరికీ భారంగా లేడుగా ?" మళ్ళీ అడిగింది.

"ఇంట్లో తిరుగుతున్నారమ్మా. మీగురించి సరిగ్గా ఇలాగే అడిగారు అయ్యగారు " అన్నాడు ఆతను.

"పనులన్నీ పూర్తి చేసుకుని ప్రయాణానికి సిద్ధంగా వున్నాను. మరి ఆ పై వాడి దయ ఎప్పుడో? పిలుపు ఎప్పుడొస్తుందో? మళ్ళీ శుక్రవారం దాకా ఉంటానో వుండనో.. మా అన్నయ్యని అడిగానని చెప్పునాయనా. నమస్కారాలని చెప్పు. ఎవరి చెవినా పడకుండా చెప్పు తెలిస్తే మళ్ళీ గొడవ " అంది మామ్మ రెండు చేతులూ జోడించి కళ్ళు మూసుకుని.

"ఈ మాట ఇవ్వాళ కొత్తాగా చెప్పాలా అమ్మా? ఎన్నేళ్ళుగా చెప్తున్నాను" అన్నాడతను. ఆ తరువాత ఆవిడేం మాట్లాడలేదు.

ఆ సాయంత్రం మామ్మ లేకుండా చూసి ఇదంతా ఇంట్లో వాళ్ళకి చెప్పాను. మామ్మ మేనల్లుడు యాభైఏళ్ళ సత్యం మావయ్య ఇదంతా విని ఆశ్చర్యపోయాడు. తరువాత భుజాన వున్న కండువాలో మొహం దాచుకుని ఏడిచాడు. ఆయనేకాడు అక్కడున్న అందరూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు .

ఇంటికెళ్ళి ఇదంతా చెప్తే అమ్మమ్మ కూడా కంట తడిపెట్టుకుంది.

పెద్దవాళ్ళంతా చిన్న పిల్లల్లాగా ఎందుకు ఏడుస్తున్నారో అంతుపట్టలేదు నాకు. అమ్మమ్మని అడిగితే చెప్పింది .

బాలమ్మ మామ్మకి ఒక అన్నయ్య, ఒక తమ్ముడు. కాపరానికి వెళ్ళకుండానే భర్త పోతే పుట్టింట్లోనే ఉండిపోయింది. తమ్ముడి భార్య గంపెడు మంది పిల్లల్నికని అర్ధంతరంగా చనిపోతే, తమ్ముడింటికి వచ్చి ఇక్కడే ఉండిపోయింది. కొంతకాలం తరువాత ఆ తమ్ముడూ పోయాడు. ఆ తరువాత దాయాదులకి ఏవో గొడవలు వచ్చాయి. ఆ ఇంటి కాకి ఈ ఇంటి మీద వాలటం లేదు. ఈ గొడవల్లో అన్నాచెల్లెళ్ళు ఇరుక్కుపోయారు. ఆవిడకి ఎనభై దాటాయి. ఆయనకి ఎనభై అయిదు. వంటరిగా వెళ్ళే శక్తీ లేదు పిల్లలని అడిగే ధైర్యమూ లేదు. అందుకే గాజులబత్తుడి ద్వారా యోగక్షేమం తెలుసుకుంటూ తృప్తి పడుతున్నారు.

అదీ అసలు రహస్యం. నేను ఇదంతా చెప్పిన మరునాడు తెల్లవారుతూనే మామ్మ మేనల్లుడు శ్రీధరం బండి కట్టించుకుని బాలమ్మ మామ్మని వెంటబెట్టుకుని కావూరు పెద్దనాన్న దగ్గిరికి వెళ్ళాడు.

పోన్లే ఆ అన్నాచెల్లెళ్ళు ఇన్నాళ్టికి మళ్ళీ ఒకరిని ఒకరు చూసుకుంటారు అని ఆనందించారు అందరూ.

ఆ మహత్కార్యంలో ఉడతలాగా సాయం చేసినందుకు నేనూ ఆనందించాను.

*(మరోజ్ఞాపకం వచ్చేసంచికలో)*

Post your comments